www.kalamjyothi.com

# కలంజ్యోతి


రేపటి కోసం

శుక్రవారం 10.01.2025



## ఆమోదం తెలిపిన గవర్నర్

- అమలుకు సర్కారు సన్నాహాలు
- ఇకపై భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మెరుగైన, సమగ్ర రెవెన్యూ సేవలకు రూపకల్పన
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




# భూ భారతికి గ్రీన్ సిగ్నల్

కలంజ్యోతి ప్రతినిధి : 'భూ భారతి' చట్టానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ప్రజా ప్రభుత్వం తీసుకురానున్న చారిత్రక చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఆమోదం ముద్ర వేశారు. దాంతో ఇకపై ధరణీ స్థానంలో భూభారతి అమలుకు మార్గం సుగుమమైంది. భూ భారతి బిల్లుకు ఆమోదం లభించడం పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గవర్నర్, సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. భూ భారతి బిల్లు కాపీని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం సచివాలయంలో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

## ఇదొక లొట్టపీసు కేసు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఇంకా వంద కేసులు పెట్టినా ఎదుర్కుంటా!
- కేసీఆర్ నాయకత్వంలో అవినీతి లేకుండా పని చేశాం
- ఏసీబీ వాళ్లు 80కి పైగా ప్రశ్నలు అడిగారు
- అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగారు
- రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు కాబట్టి అందర్నీ పంపాలని చూస్తున్నాడు..

3లో





## మోదీ పాలనలో అన్ని మతాలకు గౌరవం

### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కలంజ్యోతి, హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశంలో అన్ని మతాలకు సమ గౌరవం ఉంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. అజ్మీర్ లోని గరీబ్ నవాబ్ హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాలో 813వ ఉర్సు సందర్భంగా తెలంగాణ బీజేపీ మైనార్టీ మోర్చా తరఫున గురువారం చాదర్ పంపించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనేది బీజేపీ నినాదమన్న ఆయన మోదీ నాయకత్వంలో దేశ ప్రజలందరికీ సంక్షేమం అందుతుందని అన్నారు.

## అర్హులందరికీ ఇండ్లు


### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- 95 శాతం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- పారదర్శక సేవల కోసమే గ్రీవెన్స్ మాడ్యూల్
- ఫిర్యాదుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్
- ఇకపై ప్రతి ఫిర్యాదుపై చర్యలు..
- ఫిర్యాదుదారుడికి సమాచారం

4లో



కలంజ్యోతి
శుక్రవారం 10.01.2025




# భూ భారతికి గ్రీన్ సిగ్నల్



**కలంజ్యోతి ప్రతినిధి :** 'భూ భారతి' చట్టానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ప్రజా ప్రభుత్వం తీసుకురానున్న చారిత్రక చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఆమోదం ముద్ర వేశారు. దాంతో ఇకపై ధరణీ స్థానంలో భూభారతి అమలుకు మార్గం సుగుమమైంది. భూ భారతి బిల్లుకు ఆమోదం లభించడం పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గవర్నర్, సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. భూ భారతి బిల్లు కాపీని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం సచివాలయంలో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిల్లుకు ఆమోదం లభించడంతో వీలైనంత త్వరలో ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులకు మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామన్న ఆయన దానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. ఈ చట్టంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ చట్టం 2020 తో సామాన్య ప్రజలు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్న పొంగులేటి భూ సమస్యలేని గ్రామం తెలంగాణలో లేదన్నారు. గత ప్రభుత్వం తమ వ్యక్తిగత స్వార్థం కోసం ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించడానికి తమ ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. గ్రామాల్లో రెవెన్యూ పాలనను చూడడానికి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామనీ దానికి సంబంధించిన కసరత్తు కొలిక్కివచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం పని చేయాల్సిందేనన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కేంద్ర బిందువుగా తమ ప్రభుత్వ నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయని చెప్పారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సామన్య ప్రజలు సంతోషపడేలా రెవెన్యూశాఖలో అధికారులు, సిబ్బంది సమష్ఠిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

**గత నెల 20న అసెంబ్లీలో ఆమోదం!**

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణీ చట్టాన్ని గత నెల 20న అసెంబ్లీ వేదికగా రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం దానికి స్థానంలో భూ భారతికి ఆమోదం తెలిపింది. మరుసటి రోజు శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోద ముద్ర వేశారు. దాంతో వెంటనే గవర్నర్ ఆమోదం కోసం వెళ్లగా.. తాజాగా గురువారం దానికి ఆమోదం లభించింది. ఇకపై సాగు భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల పోర్టల్ ధరణి స్థానంలో భూభారతి అమల్లోకి రానున్నది. కాగా, శాసనసభ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. దానిస్థానంలో కొత్త పోర్టల్ ను తీసుకొస్తామని చెప్పి భూభారతి పోర్టల్ ఏర్పాటు ప్రక్రియలను పూర్తి చేసింది.ఈ ఏడాది జనవరి 9న ఐదుగురు సభ్యులతో కూడిన ధరణి కమిటీ పలు క్షేత్రస్థాయి అధ్యయనాలు చేసింది. అలాగే వివిధ శాఖలతో సమీక్షల అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.అనంతరం ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం 18 రాష్ట్రాలకు వెళ్లి అక్కడి ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసింది. ఈ క్రమంలో నిపుణుల కమిటీ రాష్ట్రంలోని రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు చరమగీతం పాడేందుకు అవసరమైన అన్ని రకాల సెక్షన్లను చట్టంలో చేర్చేందుకు ప్రణాళిక రచించి నిర్ణయించింది.ఆగస్టులో డ్రాఫ్ట్ ను సిద్ధం చేసి వివిధ వర్గాల సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. ఈ చట్టంపై దాదాపు 11 నెలల పాటు నిపుణులు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూర్తిస్థాయిలో కసరత్తు చేశారు. చివరికి 21సెక్షన్లతో డ్రాఫ్ట్ ను సిద్ధం చేయగా.. వాటిలో 19సెక్షన్లు వివిధ క్లాజులకు సంబంధించినవి కావడం విశేషం.

**'భూ భారతి'లో తహశీల్దార్లకు అధికారాలు..**

కాగా.. ధరణి చట్టంలో భూమి సమస్యను పరిష్కరించడానికి అధికారులకు ఎలాంటి అధికారాలు లేవు. ఎలాంటి అధికారాలు కూడా లేకుండా కలెక్టర్, సీసీఎల్ఏలు పని చేశారు. భూ భారతి చట్టంలో తహశీల్దార్ మొదలుకొని.. కలెక్టర్ వరకు సమస్యలను పరిశీలించి, పరిష్కరించే అధికారాలు ఉండడం విశేషం. తాజాగా చట్టంతో ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా అమలు చేస్తే ప్రజలకు అంత మేరకు సత్వర న్యాయం జరిగే అవకాశాలున్నాయి.

**విధివిధానాల రూపకల్పన**

కొత్త చట్టం విధివిధానాల రూపకల్పనపై అధికారులు దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. 'ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. వీలైనంత త్వరలో దీన్ని అందుబాటులోకి తీసుకువస్తాం. చట్టం రూపకల్పనలో సహకరించిన సహచర మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, శ్రమించిన అధికారులు, సిబ్బంది, సలహాలు అందించిన మేధావులందరికీ రాష్ట్ర భూ యజమానుల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నా' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

### ఆర్వోఆర్-2020 స్థానంలో..
## భూ భారతి

రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న తెలంగాణ పట్టా పాసుపుస్తకాలు, భూ యాజమాన్య హక్కుల చట్టం (ఆర్వోఆర్)2020 స్థానంలో భూ భారతి(ఆర్వోఆర్)2025 అమల్లోకి రావడానికి ప్రభుత్వం నోటిఫై తేదీని ప్రకటించాల్సి ఉంది. గవర్నర్ ఆమోద ముద్రతో బిల్లు చట్ట రూపం దాల్చినా.. విధివిధానాల రూపకల్పన అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఆ రోజు నుంచే కొత్త చట్టంతోపాటు ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి పోర్టల్ అమల్లోకి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.



# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

### కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్ చార్జి కొలను హనుమంతు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్లుగా ఎన్నికైన శ్రీనివాస్ చారి, బుచ్చిరెడ్డి, రవీందర్, రాజు, వేణు గౌడ్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో జరిగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, లక్ష్మారెడ్డి, కృష్ణగౌడ్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

# ఇదొక లొట్టపీసు కేసు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఫార్ములా ఈ - కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏడు గంటల పాటు కేటీఆర్ విచారణ కొనసాగింది. విచారణ అనంతరం బయటికొచ్చి మీడియాతో మాట్లాడారు. అనంతరం.. అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విచారణలో తనను ఏం ప్రశ్నలు అడగాలో తెలియక ఏసీబీ అధికారులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ కేసులో అవినీతి ఎక్కడుంది అని అధికారులను అడిగాను.. దాంతో అధికారులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనబడ్డట్లు.. రేవంత్ రెడ్డికి అందరూ దొంగలుగానే కనిపిస్తారని విమర్శించారు. తాను ఒక్క పైసా అవినీతి చేయలేదని తేల్చి చెప్పారు. జుబ్లీహిల్స్ ప్యాలెస్ కి వస్తా.. ఓపెన్‌గా కెమెరా పెట్టు.. ఈ కేసుపై చర్చిద్దామని సవాల్ చేశారు. కావాలంటే లై డిటెక్టర్ పెట్టు అని కేటీఆర్ అన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ.. తనకు మద్దతుగా వచ్చిన మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. గత పది సంవత్సరాల్లో కేసీఆర్ నాయకత్వం అవినీతి లేకుండా పని చేశామని పేర్కొన్నారు. తనను ఏసీబీ వాళ్లు 80కి పైగా ప్రశ్నలు అడిగారు.. అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్ళీ అడిగారన్నారు. ఏసీబీ వాళ్లకు కూడా ఈ కేసులో ఏమి లేదని తెలుసని.. ఇంకా తనపై వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటామని చెప్పారు. ఇదొక లొట్టపీసు కేసు మాత్రమేనని విమర్శించారు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు కాబట్టి అందర్నీ పంపాలని చూ స్తున్నాడు.. నిన్ను ఎవరూ సీఎంగా గుర్తు పట్ట ట్లేదని వ్యాఖ్యా నించారు. అందుకే అందరూ పేరు మరిచి పోతున్నారని ఎద్దేవా చేశారు. తనను అడగడానికి ఏసీబీ వాళ్ల దగ్గర ప్రశ్నలు లేవ న్నారు. రేవంత్ రెడ్డి ఏమన్నా ప్రశ్నలు పంపితే మళ్లీ పిలుస్తారు ఏమో.. మళ్లీ విచారణకు వెళ్లడా నికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్ట చేశారు.

**సుప్రీంకోర్టులో నిరాశ**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో నిరాశ ఎదురైంది. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు.. కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దాంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ స్పష్టం చేశారు.

**అర పైసా అవినీతి కూడా చేయలేదు**

ఏసీబీ విచారణ వెళ్లే ముందు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ బిడ్డగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన కార్యకర్తగా, కేసీఆర్ సైనికుడిగా రాష్ట్ర ప్రతిష్ఠ పెంచడానికి, హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలపడానికి మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశా. తెలంగాణ ప్రతిష్ఠ పెంచడానికే ఫార్ములా ఈ - కార్ రేసు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మా బావమరుదులకు వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చుకోలేదు. కాంట్రాక్టులు ఇచ్చి ల్యాండ్ క్రూజర్లు తీసుకోలేదు. నేను అర పైసా అవినీతి కూడా చేయలేదు. బురద చల్లి రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వంపై మా పోరాటం కొనసాగుతుంది. నా మీద కేసు పెట్టి, నన్నేదో చేయాలనుకుంటున్నాడు. డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డి చేస్తున్నాడు. మేము భయపడే ప్రసక్తే లేదు.



## ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా

# వనజ అశోక్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**
రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జగద్గిరిగుట్ట అశోక్ మెమోరియల్ చాణక్య విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆల్వాల వనజ అశోక్ నియమితులయ్యారు. బుధవారం బహదూర్ పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వనజ ప్రమాణ స్వీకారం చేశారు.

**కరస్పాండెంట్ స్థాయి నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వరకు**

జగద్గిరిగుట్ట అశోక్ మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ స్థాయి నుంచి కుత్బుల్లాపూర్ మండలం గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ అసోసియేషన్ (క్యూఎంఆర్ఎస్ సీఏ) ప్రధాన కార్యదర్శిగా, మండల అధ్యక్షురాలుగా, ట్రస్మా మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీగా, జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఇలా ఒక మహిళ కరస్పాండెంట్ గా ఉంటూ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వనజ అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు పదవి అప్పగించినందుకు చిత్తశుద్ధితో పాఠశాలల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వనజకు పలువురు కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..

కలంజ్యోతి, చివ్వెంల : హైదరాబాద్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటన మండల పరిధిలోని ఐలాపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గుప్తా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వలస కూలీలను ఛత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తోంది. ఈ క్రమంలోనే రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ఓ లారీని, బస్సు అతివేగంతో ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఎనిమిది మందికి గాయలయ్యాయి.

# చెన్నారెడ్డి దాతృత్వం

## మోడల్ స్కూల్ కు కిచెన్ సామగ్రి అందజేత



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ తోగర్ చెన్నారెడ్డి దాతృత్వం చాటుకున్నారు. తన తల్లిదండ్రు లు తోగరు విజయ గోవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం అమీనా బాద్ లోని మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ కు కిచెన్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. జీవితంలో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కేల్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనున్న స్థలాలను ఇటీవలే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించినట్లు గుర్తుచేశారు.



ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని చెన్నారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ స్పెషల్ ఆఫీసర్ మెట్ పల్లి జ్యోతి, కె.స్రవంతి, ఏఎన్ఎం రోజా, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్రి మోహన్, వంగపండ్ల చిన్నరాజు, మండల భాస్కర్, మేడి సుధాకర్, మిల్కూరి అశోక్ రెడ్డి, మల్లాడి వీరారెడ్డి, బేతి రజాకర్ పాల్గొన్నారు.



## సంక్రాంతి ముగ్గుల పోటీలు

**విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బాచుపల్లి సీఐ ఉపేందర్ రావు**

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ 191 ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఎస్‌బీఐ లైఫ్, 191 ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బాచుపల్లి సీఐ ఉపేందర్ రావు, డివిజన్ కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు కడ్తాల్ పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్కటి ముగ్గులు వేసిన మహిళలను అభినందిస్తూ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎస్‌బీఐ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్ రెడ్డి, స్పాన్సర్స్ కాళ్ళకూరి కాశీ విశ్వనాథ్, కదిరే మధ, దుగ్గి ప్రదీప్, 191 ఎన్టీఆర్ నగర్ ప్రెసిడెంట్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శోభారాణి, కాలనీ వాసులు రాజేష్, ఉపేందర్, మల్లేష్, నర్సింహనాయక్, శేఖర్ మోహన్, శేఖర్, జితేందర్, దత్తు, మహేందర్, జితేందర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇండ్లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్ ను తీసుకువచ్చినట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్వహించనున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu.telangana.gov.in కు ఫిర్యాదు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ప్రారంభించిన పొంగులేటి.. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదుపై ఎప్పటికప్పుడూ తీసుకున్న చర్యల వివరాలు ఆ ఫిర్యాదుదారుడి మొబైల్‌కు మెసేజ్ ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళ్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎలాంటి మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈ నెల 8వ తేదీ నాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాలలో 95 శాతం పూర్తి అయిందన్నారు. గ్రేటర్



హైదరాబాద్ పరిధిలో 88 శాతం పూర్తి అయిందని చెప్పారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఇండ్ల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దృష్టి సారించాలన్నారు. అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని చెప్పారు. మొదటి విడతలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కర్మచారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి లబ్ధిదారులే ఇండ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పించామన్నారు. లబ్ధిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇండ్లు నిర్మించుకోవచ్చని.. చివరి లబ్ధిదారుని వరకు ఇండ్ల మంజూరు చేసి నిర్మించే బాధ్యత ఈ ఇందిరమ్మ ప్రభుత్వానిదేనని ఆయన మరోమారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్ , హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి



రాయ్‌పుర్ : ఛత్తీస్ గఢా రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో భీకర ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. భద్రత బలగాల నుంచి ఇద్దరు గాయపడినట్లు సమాచారం. బీజాపూర్ జిల్లా కేంద్రం నుంచి సుమారు 130 కిలో మీటర్ల దూరంలో సుమారు గంటన్నర పాటు ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వెంట ఉన్న దక్షిణ బీజాపూర్ జిల్లాలోని ఉసూర్ , బాసగూడ పమేడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూబింగ్ జరుపుతున్న క్రమంలో వారికి మావోయిస్టులు ఎదురుపడ్డారు. దాంతో ఒక్కసారిగా రెండు వైపుల నుంచి కాల్పుల మోత మోగింది.